# సత్యవాక్కు

## క్రైస్తవ మాస పత్రిక

# THE WORD OF TRUTH

# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్య వాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 25 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్కు మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 15/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA-533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్కు నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవసరం!!

రాజన్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్యం

**THE WORD OF TRUTH**

**P.O. Box 80, KAKINADA, A.P. 533 001**

Editor : J. C. CHOATE

Managing Editor : JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంచిక 7 ఫిబ్రవరి 1988 సంపుటి 8


## సంపాదకీయము

### నేడు క్రైస్తవులు ఏల హింసింపబడుటలేదు

### (*Why Aren't Christians Persecuted Today ?*)

"క్రీస్తు యేసునందు సద్భక్తితో బ్రదుకనుద్దేశించు వారందరు హింస పొందుదురు" అని అపొ. పౌలు చెప్పాడు (2 తిమో 3 : 12). మొదటి శతాబ్దములో యున్న క్రైస్తవులు పౌలుతో సహా హింసింప బడ్డారని మన మెరుగుదుము. వారిలో అనేకులు కొట్టబడ్డారు, రాళ్లతో రువ్వబడ్డారు. చెరసాలలో వేయబడ్డారు, చంపబడ్డారు (2 తిమో 3:11; అపొ. కా. 16:16-33; 14:19; 12:1-5). అయితే నేడు క్రైస్తవులు ఏల హింసింపబడుటలేదు ? 2 తిమోతి 3:12లో పౌలు చెప్పిన సంగతి ఆనాటి క్రైస్తవులకే వర్తించెనా ? అయితే అట్లని అతడు చెప్పలేదు. కాని అది 20వ శతాబ్దములోని క్రైస్తవులకు వర్తించునదయితే క్రైస్తవులు నేడు ఎందుకు హింసింపబడుటలేదు ?

ప్రపంచ మందంతటను, హిందూదేశములోను క్రైస్తవులు క్షేమంగానే యున్నారని అందరు అంగీకరిస్తారు. దేవుని నారాధించు

చున్నందున మనం జైలుకు పంపబడుటలేదు. సువార్త ప్రకటించు చున్నందున మనం చంపబడుటలేదు. సరిగదా ఆరాధించుటకు మనము స్వేచ్ఛను కలిగియున్నాము; వార్త పత్రికలను మనం వాడుకొను చున్నాము, సువార్త ప్రకటించుటకు మనం కరపత్రములను, రేడియోను వినియోగించుకొనగల్గుచున్నాము. మనం చాలమట్టుకు గౌరవించబడుచున్నాము, అంగీకరించబడుచున్నాము.

అయితే పౌలు చెప్పిన మాటను మనం మరలగుర్తుకు తెచ్చుకోవాలి. మనం క్రైస్తవుల మయితే, సద్భక్తిగలిగి జీవించుచున్నట్లయితే హింస పొందుదుమని అతడు చెప్పాడు. బహుశ మనం బోధించవలసిన రీతిగా సువార్తను బోధించుటలేదేమో; మనం పాపాన్ని, అబద్ధ బోధలను సరిగ ఎదిరించుటలేదేమో, అందువలన నిజానికి లోకం మనలను గుర్తించుట లేదేమో ? అంటే నిజానికి మనం గుర్తించ బడేటట్లుగా సువార్త పనిచేయుట లేదని దీని యర్థం. ఇది విచారకరం.

తాము అనుభవించుచున్న ప్రశాంతతను భంగపరచడానికి ఇష్టపడని సహోదరుల కాలంలో మనం జీవించుచున్నాము. లోకము వారిని మెచ్చుకోవాలని వారు కోరుదురు. లోకాన్నుంచి, మతశాఖలనుంచి ఏదైనా ప్రతిపక్షము ఎదురయ్యేలాగున ఎవరైనా బోధిస్తే, మనసహోదరులే మొదట వారిలో తప్పులు ఎన్నుతారు.

మనకు హింస కలిగేలాగున కావాలని కానిపనులు మనం ఎన్నడు చేయరాదు. అయితే మన విశ్వాసం మనల్ని నడిపించుచున్నప్పుడు, కదిలించుచున్నప్పుడు మనం వెళ్లి సువార్తను బోధించుచున్నప్పుడు, ధైర్యముగా దేవునిపని చేయుచున్నప్పుడు మనం తప్పక కొంత ప్రతి పక్షాన్ని ఎదుర్కొంటాము, కొంత హింసకు గురి అవుతాము, ఈవార్త వ్యాపించగానే కొందరు ఇంకా వ్యతిరేకులౌతారు, మరికొందరు సత్యంలోనికి ఆకర్షిపబడతారు, దేవునికి విధేయులవు

తారు. క్రీస్తు పనిచేస్తారు. మన విశ్వాసాన్ని బట్టి పనినిబట్టి హింస పొందే స్థితికి మనం వచ్చినట్లయితే, క్రీస్తు సువార్త ఇంకా వ్యాపిస్తాది, ఆయన సంఘం అభివృద్ధి చెందుతాది. క్రీస్తు యొక్క నిజ అనుచరుల గురుతు యిది.

---

## ఆత్మతోను, సత్యముతోను కానుకలు సమర్పించుట

మానవుడు దేవునికి అర్పించు కానుకలు మత సంబంధమైన ఆచారంగా, అలవాటుగా చాలమంది భావిస్తున్నారు. ఇది సరియైన దృక్పథం కాదు. కానుకలు అర్పించటం దేవునికి అర్పించు ఆరాధనలో ఒకభాగం. అందుచేతనే ఆత్మతో సత్యంతో కానుకలు సమర్పించాలని చెప్పుకుంటున్నాం. చందా, దాతృత్వము, కృప, ఉపకార ద్రవ్యము, ధర్మము, పరిచర్య, సేవ మొదలైన పేర్లతో కానుకలు పిలువబడ్డాయి (1 కొరింథీ 16 : 1-2; II కొరింథీ 8 : 2; 8 : 19; 9:5; 9:12; 13). హేబెలు మొదలు మొదటి శతాబ్దపు పరిశుద్ధుని వరకూ దేవునికి అర్పించిన కానుకలను గూర్చి పరిశుద్ధ గ్రంథమందు ప్రస్తావించబడింది. హేబెలు తన మందలో తొలు చూలున పుట్టిన వాటిని దేవునికి అర్పణగా సమర్పించాడు (ఆది 4:4). నోవహు పవిత్ర జంతువుల్ని, పవిత్ర పక్షుల్ని దేవుని బలిపీఠం మీద దహించాడు (ఆది కాం. 8:20). యాజకుడైన మెల్కీసెదెకుకు అబ్రాహాము దశమాంశములను ఇచ్చాడు (ఆది 14 : 20). పదియవ వంతు ఇస్తానని యాకోబు దేవునికి మ్రొక్కుకున్నాడు (ఆది 28 : 22). దేవుని రాజ్య పౌరులైన ఇశ్రాయేలీయులు (నిర్గమ 19:5, 6) దేవునికి వివిధ బలులు అర్పించుటేకాక (లేవీ 1-5 అ॥లు) దశమ భాగములను సమర్పించారు (సంఖ్యా కాం 18 : 21-24). మొదటి శతాబ్దపు క్రైస్తవులు కూడ దేవునికి కానుకలు అర్పించారు. ఆత్మతో, సత్యంతో వారు కానుకలు అర్పించి దీవెనల నందారు.

ఆత్మతో కానుకలు సమర్పించుట అనగానేమి? మానవుడు శరీరాత్మల సమ్మేళనం. ఆత్మ (అంతర్య పురుషుని)లో (II కొరింథీ 4 : 16) మనస్సు, హృదయం, మనస్సాక్షి ఇమిడి వున్నాయి. అలవాటుగా, ఆచారంగా అర్పిస్తే ఆత్మతో అర్పించటం జరుగదు. మాసిదోనియ వారు అర్పించినట్లు ముందుగా "తమ్మును తాము" దేవునికి అర్పించుకోవాలి, వ్యక్తిగత సమర్పణ అవుసరం (II కొరింథీ 8:1-5). నేడు దేవుని రాజ్య పౌరులను పరిపాలించుచున్న క్రీస్తు, తాను శరీరధారిగా జీవించిన దినాల్లో పేద విధవరాలిని అభినందించటానికి కారణం ఇదే (లూకా 21:1-5). వ్యక్తిగత సమర్పణలేకుండా స్వార్థపూరిత హృదయాలతో దేవునికి అర్పించే కానుకలు నిష్ప్రయోజనం.

ఆత్మతో కానుకలు సమర్పించుటలో సిద్ధ మనస్సు ఇమిడివుంది. "మొదట ఒకడు సిద్ధమైన మనస్సు కలిగియుంటే శక్తికి మించి కాదు గాని కలిమి కొలదియే ఇచ్చినది ప్రీతికరమవున"ని పౌలు వివరిస్తున్నాడు (II కొరింథి 8 : 12). ఈ సందర్భంలో ఇశ్రాయేలీయులు సాక్ష్యపు గుడారము నిర్మింపబడే దినాలలో అర్పించిన కానుకలు మనకు ఆదర్శం కాగలవు. ప్రతివాడు "మనః పూర్వకముగా" అర్పించటం జరిగింది. (నిర్గమ 30 : 20-29; 36:4-7).

ఆత్మతో కానుకలు సమర్పించటంలో ప్రేమ నిబిడీకృతమై వుంది. పేరుకోసం, పన్ను వినాయింపుకోసం (ఇది విదేశాలలో జరుగుతుంది) అర్పించే కానుకలు స్వార్థ పూరితం. అందుకే పౌలు, "బీదల పోషణకొరకు నా ఆస్తి అంతయు ఇచ్చినను, కాల్చబడుటకు నా శరీరము అప్పగించినను ప్రేమ లేనివాడనైతే వ్యర్థుడను" అని అన్నాడు (1 కొరింథీ 13:3). ప్రేమ లేకుండా అర్పించే కానుకలు వ్యర్థం.

ఆత్మతో కానుకలు అర్పించటంలో విశ్వాసం కూడ ఇమిడి వుంది. విశ్వాసము లేనిదేదైనా దేవునికి అయిష్టమే. హేబెలు అర్పణలను గూర్చి పరిశుద్ధాత్ముడు ఇలా చెప్పుచున్నాడు. "విశ్వాసమును

బట్టి హేబెలు కయీను కంటే శ్రేష్టమైన బలి దేవునికి అర్పించెను. దేవుడతని అర్పణలను గూర్చి సాక్ష్య మిచ్చినప్పుడు అతడు ఆ విశ్వాసమునుబట్టి నీతి మంతుడని సాక్ష్యము పొందెను. అతడు మృతినొందియు ఆ విశ్వాసము ద్వారా మాట్లాడుచున్నాడు" (హెబ్రీ 11:4). సారెపతు విధవరాలిని కూడ జ్ఞాపకం చేసుకోవటం ఈ సందర్భంలో సముచితంగా వుంటుంది (II రాజులు 17 : 8-16).

సత్యంతో కానుకలు అర్పించుట అనగానేమి ? దేవుని వాక్యమే సత్యమైనందున (యోహాను 17:17) వాక్యాను సారముగా కానుక లిచ్చుటే సత్యముతో సమర్పించుట అని చెప్పుకోవచ్చును. వివిధ మతాలు, మతశాఖలు కానుకల విషయంలో వారివారి పద్ధతులు పాటిస్తుంటారు. సత్యసంబంధులు అన్య సాంప్రదాయాలను అనుసరింప బూనటం అత్యంత ఘోరం. కవర్లు పంపిణీ, పిల్లల్ని పాట వేయటం మొదలగు అపవాది విధానాల ద్వారా ధనం సేకరించటం ప్రజల్ని దోచుకోవటం లాంటిది. కానుక లర్పించటం దేవుడు ఏర్పాటు చేసిన విధానం. అందుచేత కానుకలు ఎందుకు సమర్పించాలో ఎలా సమర్పించాలో లేఖనానుసారంగా పరిశీలించటం అత్యంత ఆవశ్యకం !

అన్యజనాంగములు, మతశాఖలు అర్పించినట్లు ఉద్దేశాన్ని తెలుసుకోకుండా కానుకలు సమర్పించటం, ఆమీదట చందాను ఎలా ఖర్చుపెట్టాలని వాదోపవాదాలకుదిగి దేవుని మందిరాన్ని పాడుచేయటం చాలాచోట్ల జరుగుతుంది. కానుకలు సమర్పించటంలో దేవుడు సంకల్పించిన ఉద్దేశాన్ని గ్రహించక అనాలోచనగా కానుకలు సమర్పిస్తే మేలుకుబదులు కీడే దాపురిస్తుంది. దేవుని ప్రజలు ఎప్పుడర్పించినా ఉద్దేశానుసారంగా, ప్రత్యేక అవసరతలనుబట్టి అర్పించారు. క్రొత్త నిబంధనప్రకారము క్రీస్తు సంఘాలలో నాల్గు ప్రత్యేక విషయములకొరకు చందా వేసినట్లు గమనించగలం. ఒకటి— స్థానిక సంఘములలో పరిశుద్ధులు అక్కరలో నున్నప్పుడు ఒక స్థానిక సంఘము మరియొక స్థానిక సంఘమునకు సహాయము చేయుటకు (అపో.

కార్య. 11:27-30). రెండు— తన జీవితమును పూర్తిగా దేవునికి అర్పించి లాభసాధనగాకాక జీవితలక్ష్యంగా సువార్తసేవను స్వీకరించిన సువార్తికులకు ఉపదేశకులకు సంఘములు సహాయము చేయుటకు (1 కొరింథీ 9:1-14). మూడు— వాక్యమందును, ఉపదేశమందును ప్రయాసపడు సంఘ పెద్దలకు ఆర్థిక సహాయము చేయుటకు (1 తిమోతి 5:17-18). నాల్గు— అర్హతలుగల విధవరాండ్రను లెఖ్ఖలో చేర్చుకొని వారిని పోషించుటకు (1 తిమోతి 5:10-18). ఈ నాల్గు ఉద్దేశముల కేగాక సంఘక్షేమాభివృద్ధికొరకు, సంఘముయొక్క ప్రత్యేక అవసరములైన భవన నిర్మాణము, సువార్త కూటములు మొదలగువాటికి, ఆయా పరిస్థితులలో ఇబ్బందులకు గురైనవారికి మనము సహాయకులము కావలసివుంది.

"ప్రతీ ఆదివారమున మీలో ప్రతివాడును తనయొద్ద కొంత సొమ్ము నిలువ చేయవలెను" (1 కొరింథి 16:1-2) అను నియమము ప్రకారము ప్రతీ ఆదివారము మనము దేవునికి కానుకలు అర్పించుచున్నాము. మంచిదే; కాని, ఇదే సూత్రములో ముఖ్య విషయమైనది మరొకటుంది, అక్కరలలోవున్న సాటి పరిశుద్ధులకు సహాయము చేయుటకుకూడ మనం మనయొద్ద కొంత నిలుపచేయుచుండాలి. మనయొద్ద నిలువచేసుకొనినదానినుండి అవసరతలుగలవారికి సహాయము చేయుట మనవిధి. సంఘం నాకేం చేసింది అని విచారించుటకంటే నేను సంఘానికేంస్తున్నాను అని క్రైస్తవుడు ఆలోచించటం మంచి లక్షణం.

## ఎంత అర్పించాలి ?

సత్యంతో కానుకలు సమర్పించుట అనే ఈ సూత్రంలో "ఎంత" అనే ప్రశ్నకూడ ప్రధానమైనదే, "అభివృద్ధి చెందినకొలది" అనే నియమంలో "ఎంత" అనేది నిర్ణయమౌతుంది. (1 కొరింథీ 16:1-2). "ఎంత" అనేది నిర్ణయించుకోవటం వ్యక్తిగత విషయంగా దేవుడు పరిగణిస్తున్నాడు. ఇది మన యధార్థతకు, నీతికి, నిజాయితీకి పరీక్ష ! దేవుని ప్రజలైన ఇశ్రాయేలీయులు పాతనిబంధన కాలంలో

దశమ భాగములను సమర్పించియుంటే పాతనిబంధన కంటె శ్రేష్టమైన నిబంధన క్రిందనున్న మనం వారికంటే అధికంగా అర్పించవలసిన అవసరంలేదా ?

సత్యంతో కానుకలు అర్పించటంలో "హృదయం" కూడ పాత్రవహిస్తుంది. హృదయంలో నిశ్చయించుకొనిన ప్రకారం కానుకలు సమర్పించటం లేఖనానుసారం (II కొరింథీ 9:7). అన్యులు, మతశాఖలవారు అర్పించేటట్లు అనాలోచనగా, ఆవేశానుసారముగా అర్పించటం దేవునిని అవమానపరచినట్లే. మనం సంపాదించేదానిలో దేవుని కెంతివ్వాలి అనేది హృదయంలో నిశ్చయించుకోవాలి. ఈ విషయంలోకూడ మన యథార్థతకు, నిజాయితీకి, నీతికి పరీక్ష వుంది. మనం కట్టుకొన్న గృహం మనదికాదు, దేవునిదే; మనం సంపాదించుకొన్న వస్తుసముదాయం మనదికాదు, దేవునిదే; మనం ఆర్జించిన భూభాగం మనదికాదు, దేవునిదే; వాస్తవానికి మనం మనవారం కాము; దేవునివారమే. ఇది గ్రహిస్తే దేవునికి ఎంత ఇవ్వాలో యుక్తమైనరీతిలో క్రైస్తవుడు హృదయంలో నిర్ణయించుకోగలడు.

## ఫ లి త ం

ఆత్మతో, సత్యంతో కానుకలు అర్పించుటవలన ఫలితమేమి ? ఇదీకూడ ముఖ్యవిషయమే. "పుచ్చుకొనుటకంటే ఇచ్చుటధన్యము" అని ప్రభువు చెప్పినట్లు పౌలు చెప్పాడు (అపో. కార్య. 20 : 35). అసలు పుచ్చుకోవద్దనిగానీ, పుచ్చుకోవటంలో ధన్యతలేదనిగానీ పౌలు చెప్పటంలేదు. కాని పుచ్చుకోవటంకంటే ఇవ్వటంలో ఎక్కువ ధన్యతవుందని చెప్పాడు. ఆత్మతో, సత్యముతో కానుకలు అర్పిస్తే కలిగే ఫలితాన్ని పరిశీలించుదాం.

ప్రపంచంలో "ఆర్థిక అసమానత్వం" అనేది భయంకరసమస్య. ఇది మానవులమధ్య అగాధాన్ని సృష్టించి, సంబంధ బాంధవ్యములను నాశనం చేస్తుంది. మానవుని విజ్ఞానశాస్త్రంగాని, హేతువాదంగాని,

చివరికి మానవతావాదంగాని ఈ సమస్యను పరిష్కరించలేకపోయింది. క్రైస్తు సంఘములు దేవుని నియమమును పాటిస్తే ఈ సమస్య కనీసం వారిమధ్యనైనా పరిష్కరింపబడుతుంది. అది కానుకలు అర్పించుట వలన ఫలితంద్వారా సాధ్యం. ఒకరి సమృద్ధి ఒకప్పుడు మరియొకరి అవసరతలు తీర్చుతుంది. అలాగే, ఒకరి అక్కర ఒకప్పుడు మరియొకరి సమృద్ధిద్వారా తీర్చబడుతుంది. మానవుని ఆర్థిక స్థితిగతులు ఎల్ల వేళలా ఒకేలా వుండవు. మార్పు అనివార్యం. ఒకప్పుడు సమృద్ధి మరొకప్పుడు అక్కరఅనే చక్రం ఎప్పుడూ తిరుగుతూనే వుంటుంది. ఆత్మతో, సత్యంతో అర్పింపబడిన కానుకలు "అందరికిని సమాన ముగా ఉండునట్లు" చేయును. (II కొరింథీ 8:13-15).

## విత్తే కొలదీ పంట

"కొంచెముగా విత్తువాడు కొంచెముగా పంట కోయును. సమృద్ధిగా విత్తువాడు సమృద్ధిగా పంట కోయును" (II కొరింథీ 9 : 6). కానుకలు సమర్పించటం విత్తనాలు - పంట సాదృశ్యంతో పోల్చబడింది. చల్లిన విత్తనాలనుబట్టే పంట పండుతుంది. ఇది ప్రకృతి నియమం. లేఖనాను సారముగా కానుకలు సమర్పించిన వారికి దేవుడు సర్వసమృద్ధిని, ఉత్తమమైన ప్రతికార్యము చేయుటకు కృపను విస్త రింప చేయగలడు (II కొరింథీ 9 : 8). చాల మంది క్రైస్తవులు అన్న వస్త్రాలకు సహా ఇబ్బంది పడుతూ ఉండటం మనం చూస్తునే వున్నాం. వారు దేవుని విధానాన్ని గౌరవించలేదని వేరే చెప్పనవసరంలేదు. స్వార్థం, పిసిని తనం, భయం దేవునికి కానుకలను అర్పించ నీయవు. ఈలాంటి మానసిక స్థితి గలవారి ఆర్థిక పరిస్థితు. లెట్లుంటాయో గ్రహించాలంటే హగ్గయి కాలంలోని ఇశ్రాయేలీయులను ఉదా హరణగా తీసుకోవచ్చు. "మీ ప్రవర్తనను గూర్చి ఆలోచించు కొనుడి. మీరు విస్తారముగా విత్తినను మీకు కొంచెమే పండెను. మీరు భోజనము చేయుచున్నను ఆకలి తీరకయున్నది, పానము చేయు

చున్నను దాహము తీరకయున్నది. బట్టలు కప్పుకొన్నను చలి ఆగకున్నది. పనివారు కష్టముచేసి జీతము సంపాదించుకొన్నను జీతము చినిగిపోయిన సంచిలో వేసినట్లుగా వున్నది" (హగ్గయి 1 : 6).

ఆత్మతో, సత్యముతో కానుకలు అర్పించుటవలన జీవనస్థితిగతులు మెరుగు పడతాయి. దేవుడు యథార్థ వంతుడు; నమ్మ దగినవాడు. మన అవసరతలు తప్పక తీరుస్తాడు. అంతేకాదు, మనము ఆత్మీయ జీవితములో అభివృద్ధి సాధించగలం. దేవుని ప్రజలు క్రీస్తు సారూప్యంలోనికి మార్చబడగలం; నీతి ఫలములు వృద్ధిపొందించుకోగలం (2 కొరి. థి 9:10-13). ధనాపేక్ష సమస్త కీడులకు మూలం. అయితే, దానిని సరిగా వాడుకొని పరలోకమందు ధనమును కూర్చుకోవాలి.

లేఖనాను సారముగా అర్పింపబడిన కానుకల వలన మరో రెండు ఫలితములున్నాయి. దేవుని ప్రజల మధ్య సంబంధ బాంధవ్యములు వృద్ధి చెందుతాయి. క్రీస్తుసంఘం దేవుని కుటుంబమనే భావన బలపడుతుంది. కొరింధీయులను చూడవలెనని యూదయ సంఘములు ఆశ పడటానికి ఇదే కారణం (2 కొరింధీ 9 : 14). అంతేకాక, దేవుని ప్రజలు అర్పించిన కానుకల ద్వారా దేవునికి మహిమ కలుగుతుంది (2 కొరింధీ 9 : 11-13).

ఆత్మతో, సత్యముతో కానుకలు సమర్పించుట నిజంగా "చెప్పశక్యముగాని దేవుని వరమే".

— M. సత్యానందం, రాజమండ్రి.

---

## సమయానికి ఆరాధనకు హాజరవుట

## *(Attending Worship on Time)*

సంఘము క్రీస్తుయొక్క వధువై యున్నది. మరియు ప్రతీవారము మన ప్రతిజ్ఞను మరల నూతన పరచుకొనుటకును, ఆయనతో

మనకుగల సంబంధమును ఆచరించుటకును మనము కూడుకొందుము. అట్టి మహత్తరమైన కూటమునకు మనలో ప్రతివాడు సమయానికి హాజరవుట అత్యవసరము.

ఆరాధన క్రీస్తుతో ప్రత్యేక సహవాసములో గడిపే సమయము. సంఘ కుటుంబము బోధింపబడడానికి అభివృద్ధికి, ప్రేరణకు, ఆనందానికి కారణమది, సమయానికి, హాజరవడం అట్టి సందర్భానికి సరియైనది. ఆలస్యముగా వచ్చువారు వారికి యితరులకుకూడ ప్రాప్తించే పూర్ణానుభవాన్ని కోల్పోవుదురు.

దైవారాధనకు మనం సమయానికి హాజరయ్యేలాగున కొన్ని కారణాలను సూచించగోర్తాను. సమయాన్ని సరిగ్గా పాటించుటవలన ఆరాధనకు మన జీవితాల్లో మనంయిచ్చే ప్రాముఖ్యత కనబడుతుంది. ఉద్యోగ సంబంధమైన ఇంటర్వ్యూలకుగాని, మన వివాహానికిగాని, ఉద్యోగానికిగాని ఆలస్యంగా వెళ్ళడానికి మనం తెగించము. మనలో కొందరు ఆదివారం ఆరాధనకు ఆలస్యంగావచ్చేటట్లు తమ ఉద్యోగానికికూడ అట్లే ఆలస్యంగావెళ్ళినయెడల వారి ఉద్యోగం ఇట్టే ఊడిపోతుంది. సమయానికి హాజరవడంవలన ఆరాధనానుభవానికి మనం ఎంత ప్రాముఖ్యత యిచ్చుచున్నామో తెలియజేయుచున్నాము. ఏమైతే ప్రాముఖ్యమో వాటికి మనం సమయానికి హాజరుకాగలం.

సమయానికి హాజరవుటవలన మన కుటుంబము యెడల మనకున్న ఆసక్తి తెలియపర్చబడతాది. "పాపిని యేసుప్రభో, నే పాపిని యేసుప్రభో" అని పాడుచుండగ మనుష్యులు రావడం, చోటుకొరకు వెదుకు కొనడం, నిన్ను దాటి వెళ్లడం ఏమంత సమంజసంగాయుండదు. సమయానికి వచ్చి కుటుంబముతో దేవుని ఆరాధించుచున్న వారికి ఆలస్యంగా వచ్చువారు ఆటంకము కలుగజేయుదురు.

సమయానికి హాజరవడం క్రమబద్ధమైనది. ఆలస్యముగా వచ్చువారు ఆరాధన క్రమాన్ని కొంత భంగపరుస్తారు. క్రమముగాను

మర్యాదగాను నడచుకొనడం దైవలక్షణం అని క్రొత్తనిబంధన బోధించుచున్నది (1 కొరి 14 : 40).

సమయానికి హాజరవడం దేవుని యెడల మన సమర్పణ జీవితాన్ని సూచిస్తాది. 2 సమూయేలు 24వ అధ్యాయములో దావీదు రాజు అరౌనా అను వాని యొద్ద వాని కళ్లమును కొనే ప్రయత్నములో యుండుట మనము చూడగలము. ఆ కళ్లాన్ని, దహన పశువులను కట్టెలను మొదలగు వాటన్నిటిని దావీదుకు అరౌనా ఉచితముగా ఇయ్యజూచాడుగాని దావీదు అందుకు నిరాకరించాడు. "రాజు-నేను ఆలాగు తీసికొనను, వెల యిచ్చి నీయొద్ద కొందును. వెల యియ్యక నేను తీసికొనిన దానిని నా దేవుడైన యెహోవాకు దహన బలిగా అర్పించనని అరౌనాతో చెప్పి ఆ కళ్లమును ఎడ్లను ఏబది తులముల వెండికి కొనెను" (2 సమూ 24:24). యేసు క్రీస్తుకు సమర్పించుకొన్న జీవితం ఎంతైనా సరే సమయానికి ఆరాధనకు హాజరవుతాది.

నేను ప్రతి కూటానికి సమయానికి హాజరౌతానని ఈనాడే ఎందుకు నిశ్చయించుకోరాదు ?

---

## స్వార్థ పరత్వము
### ( *Selfishness* )

మురికికాళ్ళను కడుగుకొనడానికి ప్రతియూదుని ఇంటియెదుట ఒక పెద్ద నీళ్ళబానయుండేది. సాధారణంగా కాళ్ళుకడిగేపనిని అతి నీచమైన బానిస చేసేవాడు. అతిథివచ్చినప్పుడు ఆ బానిస గుమ్మము దగ్గరకువెళ్ళి అతని పాదములు కడిగేవాడు. అది అంత అందమైన పని యేమీకాదు. నిజానికి అతడుచేసే పనులలో అతిహీనమైనది పాదములు కడగడమే. మరియు బానిసలు మాత్రమే దాన్ని చేసేవారు. రబ్బీల (బోధకుల) శిష్యులుకూడ తమ యజమానులకు ఈ పని చేసేవారుకాదు.

యేసు, ఆయన శిష్యులు మేడ గదిలోనికివచ్చేసరికి వారి పాదములు కడగడానికి బానిస ఎవడు అక్కడలేడు. కొన్ని దినముల క్రితమే యేసు "మీలో ఎవడు గొప్పవాడై యుండగోరునో వాడు మీ పరిచారకుడై యుండవలెను; మీలో ఎవడు ముఖ్యుడై యుండగోరునో వాడు మీ దాసుడై యుండవలెనని" ఆ పన్నెండుమందికి బోధించాడు (మత్త 20:26, 27). ఆయన బోధకు వారు మనస్సిచ్చిన యెడల ఆ పన్నెండుమందిలో ఒకడు మిగిలినవారి పాదములు కడిగియుండేవాడు లేదా ఆ పనిని వారు పంచుకొనియుండేవారు. వారట్లు చేసియుంటే అంతకన్నా అందమైనది మరొకటి యుండకపోవును గాని వారి స్వార్థమువలన అట్టిది వారికెన్నడు తట్టనేలేదు.

లూకా 22:24-26 లోయున్న సమానాంతర వచనాలను చదివితే వారెంతస్వార్థపరులో, ఆ సాయంత్రం నిజానికి వారి ఆలోచనలెట్లున్నవో మనము గ్రహించుకోవచ్చును: "తనలో ఎవడు గొప్పవాడుగా ఎంచబడునో అను వివాదము వారిలోపుట్టగా ఆయనవారితో ఇట్లనెను - అన్యజనములలో రాజులు వారిమీద ప్రభుత్వము చేయుదురు; వారిమీద అధికారము చేయువారు ఉపకారులనబడుదురు మీరైతే ఆలాగుండకూడదు; మీలో గొప్పవాడు చిన్నవానివలెను అధిపతి పరిచారకునివలెను ఉండవలెను".

ఇది ఎంత విచారకరమైన సంగతి! వారిలో ఎవడు గొప్పవాడోయని వాదించుకొనుచున్నారు. ఎవడు గొప్పవాడోయను వివాదంలో వారిలో ఎవడుకూడ క్రిందికి దిగి మిగతా వారిపాదములు కడుగబోవుటలేదు.

నీళ్ళబాన అక్కడ వున్నది; తువాలుకూడ యున్నది. అన్నీ సిద్ధముగానే యున్నవి. అయితే ఇతరుల పాదములు కడుగడానికి మాత్రం ఎవడు కదల్చబడలేదు. అయితే క్రీస్తు ఒక్కడు మాత్రమే

పాదములు కడిగే హీనమైన పని చేయడానికి తన్ను తాను తగ్గించు కొన్నాడు.

మన గౌరవాన్ని గూర్చి, ఘనతనుగూర్చి, హక్కులనుగూర్చి యోచించుకొనేలాగున శోధించబడినప్పుడు మనం యోహాను సువార్త 13 వ అధ్యాయాన్ని తీసి యేసు ప్రభువును ఒకసారి బాగా చూడాలి- బానిసవలె దుస్తులు ధరించుకొని, వంగి, తనకు సంభవింపబోయే మరణాన్ని గూర్చి కొంచెముకూడ చింతనలేకయున్న పాపుల పాదములు కడుగుచు ఆయన కనబడతాడు. వర్ణింపశక్యముగాని మన ప్రభువు యొక్క వినయాన్ని చూడగానే మన స్వార్థం నశించాలి.

— టామ్ కెల్టాన్.

## ధనాపేక్ష

ఈ లోకములో మానవుడు బ్రతకడానికి ఆహారము, వస్త్రములు, గృహము చాలా ప్రాముఖ్యమైనవి. వీటి నన్నిటిని మనకు సమకూర్చేది ధనము. ధనము మంచిదైననూ దానిని అపేక్షించిన వారనేకులు కీడులోపడుచున్నారు. కొంతమంది ధనమును ఆర్జించుటకు పలురకాలైన పాపమార్గములను వెదకుచున్నారు. క్రైస్తవులైన వారు కూడా ఇందు పడే అవకాశముగలదు. అందుచే దీనిని గూర్చి దైవగ్రంధము ఇట్లు హెచ్చరిస్తుంది. "ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము. కొందరు దానిని ఆశించి విశ్వాసమునుండి తొలగిపోయి నానా బాధలతో తమ్మును తామే పొడుచుకొనిరి" (1 తిమోతి 6:10).

పాతనిబంధనలో మనము గమనించినచో జెరహు కుమారుడైన ఆకాను ధనాపేక్షాపరుడై దేవుని ఆజ్ఞలను మీరి శపితమైన దోపుడు సొమ్మును దొంగిలించి దేవుని ఉగ్రతకు గురియై రాళ్ళతో కొట్టబడెను. అగ్నిచేత కాల్చబడి నాశనమైనట్లు చూడగలము (యెహోషువ 7 : 16-26).

ఎలీషా ప్రవక్తయొక్క సేవకుడగు గెహాజీ సిరియాదేశపు సైన్యాధిపతియైన నయమాను తీసుకొనివచ్చిన బహుమానములలో కొన్నింటిని అపేక్షించినందువలన నయమానుకు కలిగిన కుష్ఠురోగము అతనికి అతని సంతతికి అంటియుండునట్లు శపించబడెను. (2 రాజు 5 అధ్యాయము.)

క్రొత్త నిబంధనయందు అననీయ, సప్పీరాలను భార్యాభర్తలిరువురు ఏకమై పొలమమ్మి ధనాపేక్షపరులై దాని వెలలో కొంత దాచి పరిశుద్ధాత్మను మోసగించుటచే వారిరువురును మరణించిరి (అపొ. కా. 5:1-6.)

యేసు క్రీస్తువారి 12 మంది శిష్యులలో ఒకడైన ఇస్కరియోతుయూదా ధనాపేక్షాపరుడై ముప్పయి వెండి నాణెములకే ప్రభువును అప్పగించి చివరకు ఆత్మహత్య చేసుకున్నాడు (మత్తయి 27:35.)

గనుక ఈ భూమిమీద మీ కొరకు ధనమును కూర్చుకొనవద్దు. ఇక్కడ చిమ్మెటయు, తుప్పును తినివేయును. దొంగలు కన్న వేసి దొంగిలెదరు. పరలోకమందు మీ కొరకు ధనమును కూర్చుకొనుడి అచ్చట చిమ్మెటయైనను, తుప్పైనను, దానిని తినివేయదు, దొంగలు కన్నంవేసి దొంగిలరు (మత్తయి 6:19, 20).

కనుక ప్రియ సహోదరీ, సహోదరా ఈ లోకధనాపేక్షతో నాశనమగుటకంటే పరలోక ధనాపేక్ష కలిగియుండుట బహుమంచిది. నీవు ఇంకనూ పరలోకమునందు ధనమును కూర్చుకోలేనట్లయితే నీవు దేవుని వాక్యం విను, విశ్వసించు, మారుమనస్సుపొందు, యేసు నీ రక్షకుడని నోటితో ఒప్పుకొని పాపక్షమాపణ నిమిత్తం యేసు క్రీస్తు నామమున (ముంచడమనే నీటి) బాప్తిస్మము పొంది ఆయన రాజ్య (సంఘ) వారసుడవుకమ్ము. అప్పుడు నీవు ఆదివార ఆరాధనలో కానుకలిచ్చుట ద్వారా పరలోకములో ధనమును కూర్చుకొనుటకు అర్హుడ

వగుదువు. కనుక తక్షణమే మీ సమీపమునవున్న క్రీస్తు సంఘమును దర్శించుము.

పి. చంద్రశేఖర్, ధవలేశ్వరం.

---

సంక్షిప్త ప్రసంగము :

## సహోదరులను ప్రేమించుము

## *( Love The Brethren )*

1 కొరింథీ 13

పరిచయము :

1. దేవుడు లోకము నెంతో ప్రేమించాడు. (యోహాను 3:16)
2. బైబిలు ముఖ్యాంశము - ప్రేమ
3. మానవుడుకూడ ప్రేమించాలి.
4. ఈ లోకంలో ప్రేమ ఎక్కువ అవుసరం.
5. ప్రేమయే మన ముఖ్యోద్దేశమై యుండాలి

I దేవుని ప్రేమించాలి: (మత్త 22:37)

1. ఆయన ఆజ్ఞలను గైకొనాలి. యోహాను 14:15
2. ఆయనను ప్రేమించు వారికి మేలు కలుగుటకై సమస్తము సమకూడి జరుగును. రోమా 8:28
3. ఆయనను ప్రేమించాలి. 1 యోహాను 4 : 19

II మన పొరుగు వానిని ప్రేమించాలి : మత్తయి 22 : 39

1. మానవుడు తన్నుతాను ప్రేమించుకొంటాడు.
2. పొరుగు వానిని కూడ అట్లే ప్రేమించాలి.

III సహోదరులను ప్రేమించాలి :

1. ఒకరి నొకరు ప్రేమించాలి. యోహాను 15:12, 17

2. ప్రేమించాలని బోధింపబడ్డాము. 1 థెస్స 4:9
3. సహోదరులను ప్రేమించుడి. 1 పేతురు 2:17
4. సహోదరులుగా ప్రేమించాలి. 1 పేతురు 3:8, 9
5. మనము ఒకని నొకడు ప్రేమించాలి. 1 యోహాను 4:12
6. దేవుని బిడ్డలను ప్రేమించాలి. 1 యోహాను 5:2

ముగింపు :

1. దేవుడు లోకము నెంతో ప్రేమించాడు. మానవుల ఆత్మలను మనము ప్రేమించాలని కోరుచున్నాడు.
2. క్రీస్తు సంఘమును ప్రేమించాడు; మనము సహోదరులను ప్రేమించాలని కోరుచున్నాడు.
3. ప్రేమ అనేక సంగతులను చేయడానికి ప్రోత్సాహించును. అనేక సంగతులు చేయకుండగ సహాయము చేయును.
4. 1 యోహాను 4వ అధ్యాయము చదువుము.

— జె. సి. చోట్

## సువార్తకు అభ్యంతరము

## *(Hindering the Gospel)*

సువార్తను ప్రకటించువారు సువార్తవలననే తప్పక జీవించవలెనను సత్యమును చర్చించుచు పౌలు ఇట్లు చెప్పెను. "అయితే మేము ఈ అధికారమును వినియోగించుకొనలేదు; క్రీస్తు సువార్తకు ఏ అభ్యంతరమైనను కలుగజేయకుండుటకై అన్నిటిని సహించుచున్నాము" (1 కొరింథి 9:12). అతడు సువార్తకు అభ్యంతరము కలుగజేయలేదుగాని అట్లు అభ్యంతరము కలుగజేయుటకు తనకుగాని మరి ఎవనికైననుగాని సాధ్యమని అతనికి తెలియును. ఇది ఈ కాలములో కూడ వాస్తవమే.

స్వాభావికముగా తప్పును బోధించి పెంపొందించువారు క్రీస్తు సువార్తకు అభ్యంతరము కలుగజేయుదురు. ఇది సత్యము కానియెడల ముందు వాటిల్లు ఫలితములనుగూర్చి ఆలోచించుము. ఇట్లుగాక ఎక్కువహాని సంఘ సభ్యులవలననే కలుగును. మనము క్రీస్తు సువార్తకు ఎట్లు అభ్యంతరము కలుగ జేయుదుమో అట్టి మార్గములను గూర్చి యోచింతము.

1. మనము ఇతరులకు సువార్తను బోధించక, ప్రకటించక యున్న యెడల సువార్తకు అభ్యంతరము కలుగ జేయుచున్నాము. సువార్త అందరికొరకు యున్నది. అది అందరితోను సమముగా పంచుకొనవలెను. ఇక్కడనే మనము ప్రవేశించుచున్నాము. ఇతరులకు సువార్తను తీసుకొని వెళ్లుడియని ప్రభువు ఆజ్ఞాపించెను (మార్కు 16 : 15, 16). ఇట్లు చేయుటకు రెండు మార్గములు కలవు. మనము నోటితో బోధించుట ద్వారా లేక మనము జీవించే విధముద్వారా సువార్తను ప్రకటించగలము. అందరూ ఈ రెండింటిలో కొంతమట్టుకు చేయుదురు కాని చాలమంది రెండునూ చేయరు. అనగా మనము సువార్తను ఇతరులయొద్దకు తీసుకొని వెళ్ళకపోయిన మనము సువార్త పురోగతికి అభ్యంతరముగ యున్నాము. ఇది ఒక పాపము.

2. మనము సమావేశములకు హాజరు కాకపోయిన సువార్తకు అభ్యతరము కలుగును. ఇది ఎట్లు? ఇది చాలా సూక్ష్మము. మనము ఆరాధనలకు హాజరు కానియెడల మనము ప్రభువును ఆరాధించుట మానివేయుటమాత్రమేగాక ప్రభువు కొరకు జీవించుటకుగాను అవసరమైన ఆత్మీయాహారమును పోగొట్టుకొనుచున్నాము. ఇంతకన్న మరి ఎక్కువగా ఇతరులకు మంచి మాదిరిగా నుండకుండ మాని, సువార్తను నోటిద్వారాను, మాదిరిద్వారాను నేర్చుకొనుటకు అవసరముగల జనులను కలసికొను అవకాశమునుకూడా పోగొట్టుచున్నాము. హెబ్రీ గ్రంథకర్త ఇట్లు హెచ్చరించెను, "వాగ్దానము

చేసినవాడు నమ్మదగినవాడు గనుక మన నిరీక్షణ విషయమై మన మొప్పుకొనినది నిశ్చలముగా పట్టుకొందము. కొందరు మానుకొను చున్నట్టుగా, సమాజముగా కూడుటమానక, ఒకని నొకడు హెచ్చరించుచు, ఆ దినము సమీపించుట మీరు చూచిన కొలది మరి యెక్కువగా ఆలాగు చేయుచు, ప్రేమ చూపుటకును, సత్కార్యములు చేయుటకును ఒకని నొకడు పురికొల్పవలెనని ఆలోచింతము. మనము సత్యమును గూర్చి అనుభవ జ్ఞానము పొందిన తరువాత బుద్ధి పూర్వకముగా పాపము చేసిన యెడల పాపములకు బలి యికను ఉండదుగాని న్యాయపు తీర్పునకు భయముతో ఎదురుచూచుటయు, విరోధులను దహింపబోవు తీక్ష్ణమైన అగ్నియు నికను ఉండును" (హెబ్రీ 10 : 26-27).

౩. మనము క్రైస్తవులుగా పెరిగి అభివృద్ధి చెందని యెడల క్రీస్తు సువార్తకు అభ్యంతరము కలుగజేయుదుము. మనము ఆత్మీయముగా బలహీనులమై యున్నప్పుడు ఇతరులకు బోధించు శక్తికి బదులు మనకు ఇతరులు బోధించు అవసరతలో యుందుము. ఇదియే హెబ్రీ గ్రంథకర్త కూడా వ్రాసెను: "కాలమునుబట్టి చూచితే మీరు బోధకులుగా ఉండవలసిన వారై యుండగా, దేవోక్తులలో మొదటి మూలపాఠములను ఒకడు మీకు మరల బోధింపవలసి వచ్చెను. మీరు పాలు త్రాగవలసినవారేగాని మీరు బలమైన ఆహారము తినగలవారు కారు. మరియు పాలు త్రాగు ప్రతివాడును శిశువే గనుక నీతి వాక్య విషయములో అనుభవము లేనివాడై యున్నాడు. వయస్సు వచ్చినవారు అభ్యాసముచేత మేలు కీడులను వివేచించుటకు సాధకము చేయబడిన జ్ఞానేంద్రియములు కలిగి యున్నారు గనుక బలమైన ఆహారము వారికే తగును" (హెబ్రీ 5:12-14).

౪. మనము జీవించవలసిన విధముగా జీవించని యెడల ప్రభువు యొక్క రాజ్యవ్యాప్తికి అభ్యంతరము కలుగజేయుదుము. ఈ విషయ

ములో ప్రభువు నామమునకు అవమానమును, అపఖ్యాతిని కలుగ చేయుదుము. ఇట్టి విధముగా యున్న క్రైస్తవ జీవితములో పాలు మాకక్కరలేదని లోకము దూషణతో వేలుపెట్టి మనలను చూపించును. మంచివారిని, నిజాయితీగల వారిని తొట్రిల్లునట్లు చేయుదుము. ఇతరులు అనుసరించుటకు చెడ్డమాదిరిని ఏర్పరుచుదుము. ఇవి యంతయు హాని కలిగించును. మనము కేవలము నామమాత్రపు క్రైస్తవులము గాక నిజమైన క్రైస్తవులముగా యుండవలెనని ప్రభువు కోరుచున్నాడు. సమస్తమును ఆయన నామము పేరట, ఆయన మహిమార్థముగా చేయవలెనని ఆయన ఆశించుచున్నాడు. పౌలు చెప్పినది చూడుము: "మరియు మాటచేతగాని, క్రియచేతగాని మీరేమి చేసినను ప్రభువైన యేసుద్వారా తండ్రియైన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు, సమస్తమును ఆయన పేరట చేయుడి" (కొలస్స 3:17). పేతురు ఇట్లు హెచ్చరించెను, "క్రీస్తు నామము నిమిత్తము మీరు నిందపాలైన యెడల మహిమా స్వరూపియైన ఆత్మ, అనగా దేవుని ఆత్మ, మీమీద నిలుచుచున్నాడు గనుక మీరు ధన్యులు. మీలో ఎవడును నరహంతకుడుగా గాని, దొంగగా గాని, దుర్మార్గుడుగా గాని, పరుల జోలికి పోవువాడుగా గాని బాధ అనుభవింప తగదు. ఎవడైనను క్రైస్తవుడైనందుకు బాధ అనుభవించిన యెడల అతడు సిగ్గుపడక, ఆ పేరును బట్టియే దేవుని మహిమ పరచవలెను. తీర్పు దేవుని ఇంటియొద్ద ఆరంభమగు కాలము వచ్చియున్నది; అది మన యొద్దనే ఆరంభమైతే దేవుని సువార్తకు అవిధేయులైన వారి గతి ఏమవును? మరియు నీతిమంతుడే రక్షింపబడుట దుర్లభమైతే భక్తిహీనుడును పాపియు ఎక్కడ నిలుతురు? కాబట్టి దేవుని చిత్త ప్రకారము బాధ పడువారు సత్ ప్రవర్తన గలవారై, నమ్మకమైన సృష్టికర్తకు తమ ఆత్మలను అప్పగించుకొనవలెను" (1 పేతురు 4:14-19).

5. మన కర్తవ్యమును, బాధ్యతను నిర్లక్ష్యము చేయుట ద్వారా ప్రభువు యొక్క పనికి అభ్యంతరము కలుగజేయుదుము.

దుర్మార్గులు, అవినీతిపరులును కాని సభ్యులు సంఘములో అనేకు లుందురు. వారు బుద్ధిపూర్వకముగా ఏ చెడ్డపనిని చేయరు. వారు చాల మంచివారని ఇతరులు అనవచ్చును. వారిలోని బలహీనత ఏమనగా వారు చేయవలసిన పనులను నిర్లక్ష్యముచేసి కాలము గడుపుదురు. యాకోబు ఇట్లు చెప్పెను: "మీరు వినువారు మాత్రమై యుండి మిమ్మును మీరు మోసపుచ్చుకొనకుండ, వాక్యప్రకారము ప్రవర్తించువారునై యుండుడి (యాకోబు 1 : 22). విశ్వాసము మాత్రమే యను దాని విషయములో యాకోబు 2వ అధ్యాయ మును, తమ విశ్వాసములో నిమిత్తము లేనివారిని గూర్చి యాకోబు 4 : 17 ను చదువుము. ఆఖరుగా ఇది చదువుదము: "కావున మనము వినిన సంగతులను విడిచిపెట్టి కొట్టుకొనిపోకుండునట్లు వాటియందు మరి విశేష జాగ్రత్త కలిగి యుండవలెను. ఎందుకనగా దేవదూతల ద్వారా పలుకబడిన వాక్యము స్థిరపరచబడినందున, ప్రతి అతిక్రమ మును, అవిధేయతయు న్యాయమైన ప్రతిఫలము పొంది యుండగా ఇంత గొప్ప రక్షణను మనము నిర్లక్ష్యము చేసిన యెడల ఏలాగు తప్పించుకొందుము? అట్టి రక్షణ ప్రభువు బోధించుటచేత ఆరంభమై దేవుడు తన చిత్తానుసారముగా సూచక క్రియలచేతను, మహాత్కా ర్యములచేతను, నానా విధములైన అద్భుతములచేతను, వివిధములైన పరిశుద్ధాత్మ వరములను అనుగ్రహించుటచేతను వారితోకూడ సాక్ష్య మిచ్చుచుండగా వినినవారిచేత మనకు దృఢపరచబడెను" (హెబ్రీ 2 : 1-4).

**6. మనకు కలిగినది ఈయకపోవుట** ద్వారా సువార్తకు అభ్యం తరమును కలుగజేయుచున్నాము. పేదలకు సహాయము చేయుట, సువార్తను ప్రకటించుట యను కర్తవ్యమును కొనసాగించుటకు సంఘము సభ్యుల కానుకలపై ఆధారపడి యున్నది. మనము ఇవ్వమను కొనుము దీని వలన సంఘము తన కార్యకలాపములను మానివేయదు,

ఎందుకనగా మిగతా సభ్యులు వారికి ఇలిగినది ఇత్తురు అట్టి సందర్భము లలో సంఘము దాని క్రియలలో తగుమాత్రముగ యుండును మనము ఇచ్చుట మానినపుడు, దేవుని దొంగిలించుట లేక దేవునిని. తగుమాత్రముగా యుంచుట చేయుచున్నామని బైబిలు గ్రంధము చెప్పుచున్నది. మన మిచ్చుకొలది ఆయన మరి యెక్కువగా చేయును. కావున పౌలు ఇట్లు హెచ్చరించెను: "నేను వచ్చినపుడు చందా పోగు చేయకుండ ప్రతి ఆదివారమున మీలో ప్రతివాడును తాను వర్ధిల్లిన కొలది తనయొద్ద కొంత సొమ్ము నిలువచేయవలెను" (1 కొరింథీ 16:2). మనము ఈయవలసిన విధముగా ఇయ్యకపోయిన యెడల దాని ఫలితముగా ఒకడు సువార్త విన నశక్యుడగును లేక అవుసరములో యున్న వాని అవుసరము తీరకనే పోవును అని జ్ఞాపక ముంచుకొందము. ఆత్మల రక్షణ మన ఆత్మలతో కలసి, ఇతరుల క్షేమమునకు సంబంధించిన విషయమగుట చేత ఇది చాల ముఖ్యమైన విషయము.

---

## యేసే ప్రభువైయున్నాడు

### ( *Jesus is Lord* )

"యేసే ప్రభువు! నా రక్షకుడు. ఆయన వన్నెంతో ప్రేమించును. నేనెంతో ఆయనను ప్రేమింతును, ఆయన లేచియున్నాడు, మరల వచ్చుచున్నాడు ప్రభువా త్వరగా రమ్ము". ఈ మాటలు గల ఆంగ్ల గానము అతి మాధుర్యమైనది. అయితే వాటిభావం యేమిటి? యేసే ప్రభువని ఒప్పుకొనుటలో యున్న ప్రాముఖ్యత యేమిటి?

మొదటిగా 'క్యూరియోస్' (Kurios) అనే గ్రీకు పదమునకు ప్రభువని యర్ధము. మొదటి శతాబ్ధములో ఘనతను సూచించుచు సంబోధించుటకు ఇది వినియోగింపబడెనని మనం గ్రహించాలి. శారా అబ్రాహామును యజమానుడని పిలచినట్లు పేతురు చెప్పినప్పుడు

(1 పేతురు 3:6), భర్తలు యజమానులని భార్యలు గృహోపకరణములని అతని ఉద్దేశముకాదు. గాని శారా తన భర్తను గౌరవించినట్లు తెలియజేయుటకు అతడట్లు చెప్పాడు. యోహాను 12 : 21లో కొందరు గ్రీస్తు దేశస్థులు యేసును చూడగోరి వచ్చినప్పుడు ఫిలిప్పును ఇట్లు ('అయ్యా అని') సంబోధించారు. మరియు యేసును తోటమాలి అనుకొనినప్పుడు ఇదే మాటను ఆమె యోహాను 20 : 15 లో ఉపయోగిస్తాది. సువార్తలలో యేసును సంబోధిస్తూ తరుచు ఈ మాట వినియోగింపబడింది.

'క్యూరియోస్' అనుపదము తరచు ఒక యజమానిని (Master or owner) సూచించడానికి వినియోగింపబడేది. మత్తయి 20 వ అధ్యాయంలో ద్రాక్షతోట ఉపమానములో వాడబడిన పదము యిదే. యజమాని దేవుడు.దాసులను కలిగియున్న యజమానుల విషయంలో కూడ ఈ పదము వాడబడినది (ఎఫెసీ 6:5,9; కొలస్స 4).

'క్యూరియోస్' అనుపదము దేవుని యొక్క బిరుదుగా కూడ వాడబడినది. ఇశ్రాయేలు చరిత్రలో ఒక ఆసక్తికరమైన సంగతి జరిగింది. దేవుని నామమును గూర్చి గొప్ప భయము భక్తి ఉద్భవించినది. పది యాజ్ఞలలో మూడవ ఆజ్ఞను పురస్కరించుకొని ఇట్టి అత్యంత భక్తి భావము లుద్భవించి యుండవచ్చును. "నీదేవుడైన యెహోవా నామమును వ్యర్థముగా నుచ్చరింపకూడదు" (నిర్గమ20:7). గనుక దేవుని నామము ఏమిటి ? 'దేవుడు' అనుమాట ఒక నామము కాదు. అనేక వర్ణనాత్మకము మాత్రమే. నీ పేరేమిటి అని నేనడిగిన యెడల నీవు నేనొక పురుషుడను, లేక స్త్రీని అని జవాబియవుగాని నా పేరు జాన్ అని లేదా మేరీ యని జవాబిత్తువు గదా. మనము ఆరాధించే మూర్తి దేవుడు, మానవుని నుండి ప్రత్యేకముగా యున్నవాడాయన. నిర్గమ 3 : 13లో నీ పేరేమిటని మోషే దేవుని నడుగుతాడు. హెబ్రీ భాషలో రికార్డయిన పేరు యావే లేక యెహోవా,

(Yahweah or Jehoveh) అని యున్నది. ఈ పేరు యొక్క భావము, "నేను ఉన్నవాడనై యున్నాను", "నేను ఉండువాడనై యున్నాను" అని యున్నది. మూడవ ఆజ్ఞనుబట్టి హెబ్రీయుడు దేవుని నామమును ఉచ్చరింపడు. ఇశ్రాయేలీయుడెవడైనను ఈ నామమును చూడగానే యెహోవా అని పలుకుటకు బదులు "ప్రభువు" అని ఉచ్చరించును. అట్లు ప్రభువనే పదము నిజదేవుని సూచించడానికి వర్తింప జేయుటకు వాడబడేది.

## ప్రభువే దేవుడు

అందువలన "యేసు ప్రభువైయున్నాడని" ఒప్పుకొనుటలో యేసే దేవుడై యున్నాడని ఒప్పుకొనుట యని మనం గ్రహించాలి. ఆదిమ సంఘములో ఇది యిట్లు వాడబడినట్లు మనము చూడగలము. రోమా 14 : 8 లో పౌలు ఇట్లు అన్నాడు: "మనము బ్రదికినను ప్రభువు కోసరమే బ్రదుకుచున్నాము; చనిపోయినను ప్రభువు కోసరమే చనిపోవుచున్నాము. కాబట్టి మనము బ్రదికినను చనిపోయినను ప్రభువు వారమై యున్నాము". హెబ్రీ 1 : 8 లో దేవుడు యేసుతో ఇట్లనుచున్నాడు, "దేవా నీ సింహాసనము నిరంతరము నిలుచునది. నీవు నీతిని ప్రేమించితివి, దుర్నీతిని ద్వేషించితివి. అందుచేత దేవుడు నీ దేవుడు నీతోడి వారికంటె నిన్ను హెచ్చించునట్లుగా ఆనందతైలముతో అభిషేకించెను. ప్రభువా నీవు ఆదియందు భూమికి పునాది వేసితివి, ఆకాశములు కూడ నీచేతి పనులే. (9, 10, 11 వచనములు). "యేసు పునరుత్థానుడైన తరువాత తోమా ఆయనను చూచి "నా ప్రభువా, నా దేవా" అనుటలోని భావము బహుశ యిదే అయ్యుండవచ్చును (యోహాను 20 : 28). రోమా 10 : 9 లో పౌలు, "యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొని దేవుడు మృతులలోనుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించిన యెడల నీవు రక్షింపబడుదువు" అనుటలో పౌలు యొక్క భావము కూడ యిదే. రోమా 13 : 14 లో

పౌలు రోమీయులకు "ప్రభువైన యేసు క్రీస్తును ధరించుకొనుడి" యని చెప్పాడు. గలతీ 3 : 26-27 లో అతడిట్లున్నాడు: "యేసు క్రీస్తునందు మీరందరు విశ్వాసమువలన దేవుని కుమారులై యున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు".

యేసును ప్రభువని గుర్తించుటయే ఆయన శరీరధారియైన దేవుడని గుర్తించుట, దేవుడు మానవావతారియై మన పాపముల నిమిత్తము సిలువలో బలియగుటను అంగీకరించుటయే. ఆయన ప్రభువని మనము నమ్మాలి, ఆయన సార్వభౌమత్వములోనికి బాప్తిస్మము పొందాలి. యేసే ప్రభువు, నా రక్షకుడు.

## దేవుని సొత్తు

ఒకడు క్రైస్తవుడగునప్పుడు అతడు లేక ఆమె తనకు కాదు గాని దేవునికి చెందును. 1 కొరింథీ 6:19-20లో ఇట్లున్నది: "మీ దేహము దేవుని వలన మీకు అనుగ్రహింపబడి మీలోనున్న పరిశుద్ధాత్మకు ఆలయమై యున్నదని మీ రెరుగరా? మీరు మీ సొత్తు కాదు. విలువ పెట్టి కొనబడినవారు గనుక మీ దేహముతో దేవుని మహిమ పరుచుడి". గనుక ప్రభువని గుర్తించుటలో యజమాని యని గుర్తించుట యున్నది. అందు వలననే పౌలు 'క్రీస్తుయొక్క దాసుడనని' తాను చెప్పుకో గలిగాడు (రోమా 1:1). మనము దేవుని దాసులుగ జీవించాలని పేతురు చెప్పాడు (1 పేతు 2:16).

## దేవుని స్నేహితులం

అయినను ప్రభువుతో మనమొక ప్రత్యేకసంబంధమును కలిగి యున్నాము. యోహాను 15:12-15లో యేసు ఇట్లన్నాడు: "నేను మిమ్మును ప్రేమించిన ప్రకారము, మీ రొకని నొకడు ప్రేమించవలెననుటయే నా ఆజ్ఞ. తన స్నేహితుల కొరకు తన ప్రాణము పెటు

వాని కంటె ఎక్కువైన ప్రేమగలవా డెవడును లేడు. నేను మీా కాజ్ఞాపించు వాటిని చేసినయెడల మీారు నా స్నేహితులై యుందురు. దాసుడు తన యజమానుడు చేయు దానిని ఎరుగడు గనుక ఇక మిమ్ము ను దాసులని పిలువక స్నేహితులని పిలుచుచున్నా ను; ఎందుకనగా నేను నా తండ్రివలన వినిన సంగతులన్నిటిని మీాకు తెలియజేసితిని". మరల 17వ వచనములో, "మీారు ఒకని నొకడు ప్రేమించవలెనని మీాకు ఆజ్ఞాపించు చున్నాను". యేసు ప్రభువని, సృష్టికర్తయని, సమస్తాధికారము ఆయన కలిగియున్నాడని మనము గుర్తించినను (మత్త 28:18), మనము జ్ఞాన హీనులైన బానిసలముగా గాక స్నేహితులముగా స్వీకరింప బడితిమి. ఎంత ఆశ్చర్యకరమైన భావనయో! యేసే ప్రభువు, అయినను ఆయన నా వ్యక్తిగత స్నేహితుడు. నేనేమి చేయాలో చెప్పుట మాత్రమేగాక ఆయన ఎందుకు చేయాలో తెలియజేస్తాడు. ఆయన స్నేహితునిగా యుండాలంటే ఆయన మనల్ని ప్రేమించినట్లు మనం ఒండొరులను ప్రేమించాలి.

## క్రీస్తుతోడి వారసులం

గలతీ 4 : 1-7లో పౌలు ఇట్లనుచున్నాడు : "వారసుడు అన్నిటికి కర్తయైయున్నను, బాలుడై యున్నంత కాలము అతనికిని దాసుని కిని ఏ భేదములేదు. తండ్రిచేత నిర్ణయింపబడిన దినము వచ్చువరకు అతడు సంరక్షకుల యొక్కయు గృహ నిర్వాహకుల యొక్కయు ఆధీనములో యుండును". మనము బాలురమై యున్నప్పుడు లోక భారములకు బానిసలము, అయితే దాసత్వమునుండి కుమారత్వము ననుగ్రహించుటకు దేవుడు యేసును పంపాడు. విశ్వాసి బాప్తిస్మము పొందినప్పుడు అతడు క్రీస్తును ధరించుకొంటాడు (గల 3 : 27). మరియు మనహృదయములలోనికి దేవుడు పరిశుద్ధాత్మను పంపుతాడు, అప్పుడు పరిశుద్ధాత్మవలన అబ్బా, తండ్రీయని మొరపెట్టగలము. మనము

దేవుని కుమారులము, కుమార్తెలము, ఆయన ఆశీర్వాదములకు వారసులము.

గనుక యేసే ప్రభువని మనము పాడినను, మాట్లాడినను ఆయన దైవత్వాన్ని, స్నేహాన్ని ఒప్పుకొనుచున్నాము. మనస్థానములో యేసు పొందిన మరణమునుబట్టి మనకు కలిగిన ప్రత్యేక సంబంధమువలన మనము దేవుని బిడ్డలము; ఈ సంబంధాన్ని ప్రకటిస్తాము.

అయినను మనము సరియైన క్రమాన్ని పాటించుట అవుసరము. యేసు మన మిత్రుడు కాకముందు ఆయన యజమానియని, దేవుడని ఒప్పుకోవాలి.

★

— జార్జిస్నైడర్, మినిస్టర్
రేటవున్ క్రీస్తుసంఘము.

---

Regd. No. H/KD—45/KD·H·O.

*From*
SATYAWAKKU
P.O. Box. 80
KAKINADA-533 001

No.

To

..............................................
..............................................
..............................................
..............................................